## గెలుపే లక్ష్యంగా పనిచేయాలి


బీఎస్పీ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వారితో శ్రీనివాస్

పెంచికల్‌పేట్, ఏప్రిల్ 20 : ఆదిలాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపే లక్ష్యంగా పని చేయాలని బీఆర్ఎస్ మండల నాయకుడు బిట్టు శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని గుండెపల్లి గ్రామంలో బూత్ కమిటీ స్థాయి సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్ సూచనల మేరకు ఊరూరా బూత్ కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం బీఎస్పీ నుంచి పలువురు బీఆర్ఎస్‌లో చేరగా, వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు సుధాకర్, సురేశ్, గణేశ్, మధుకర్, శ్రీనివాస్, చిన్నన్న, నారాయణ, సుగుణాకర్, భద్రయ్య, గంగాధర్ పెంటయ్య, సోమయ్య, తిరుపతి, శేఖర్, చిన్నయ్య పాల్గొన్నారు.

## ఫిర్యాదులన్నీ ఆన్‌లైన్‌లో నమోదవ్వాలి

- ఎస్పీ కే.సురేశ్‌కుమార్
- ఆసిఫాబాద్ పోలీస్‌స్టేషన్ తనిఖీ


ఆసిఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ కే.సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 20 : పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎస్పీ సురేశ్ కుమార్ సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆసిఫాబాద్ పట్టణ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేసులకు సంబంధించిన ఫైళ్లు, రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ఉండాలని, సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఎలక్షన్ కోడ్ అమల్లో ఉన్నందున విధుల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. ఆసిఫాబాద్ పట్టణ సీఐ సతీష్, ఎస్ఐ ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌కు ఓటేసి గెలిపించాలి

- మోసపూరిత హామీలిచ్చిన కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలి
- మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు
- దొనబండ, బుద్ధిపల్లిలో ఇంటింటా ప్రచారం


దొనబండలో ప్రచారం చేస్తున్న మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్, ఏప్రిల్ 20 : రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు ఓటేసి గెలిపించాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు కోరారు. శనివారం హాజీపూర్ మండలం దొనబండ, బుద్ధిపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కేసీఆర్ సర్కారులో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. దొనబండలో ఉపాధి పనులు చేస్తున్న కూలీల దగ్గరకు వెళ్లి తన హయాంలో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి వివరించారు. రైతుబంధు డబ్బులు పడలేదని పలువురు రైతులు ఆయన ముందు కంటతడి పెట్టుకున్నారు. రెండు లక్షల రుణమాఫీ చేస్తానంటే నమ్మి కాంగ్రెస్‌కు ఓట్లు వేశామని, ఆ పార్టీ ఇంతలా మోసం చేస్తుందనుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు మాట్లాడుతూ ప్రజలు కేసీఆర్ పాలనలో ఎంతో సంతోషంగా ఉన్నారని, కాంగ్రెస్ పాలనలో సమస్యలతో సతమతమవుతున్నారని మండిపడ్డారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో సీట్ల కోసం ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చిందని, నాలుగు నెలలకే ఆ పార్టీ వైఖరేమిటో ప్రజలకు అర్థమైపోయిందని పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏనాడూ రైతులు నీళ్ల, కరంట్ కోసం ఆందోళన చేసింది లేదని గుర్తు చేశారు. అన్ని వర్గాలను కాపాడుకునే ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు జాడి సత్యం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మొగిలి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ మందపల్లి శ్రీనివాస్, సర్పంచులు ఫోరం మండల మాజీ అధ్యక్షుడు గొల్ల శ్రీనివాస్, నాయకులు బెతు రవి పాల్గొన్నారు.

# ఆసిఫాబాద్ టూ మహారాష్ట్ర

## జోరుగా బియ్యం దందా

- లక్షలు సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు
- టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేస్తున్నా ఆగని దందా
- కానరాని చెక్‌పోస్టులు.. చేతులు తడిపితే చాలు పనైపోతుంది..


ఇటీవల పెంచికల్ పేట్‌లో పట్టుకున్న 15 క్వింటాళ్ల బియ్యం

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఏప్రిల్ 20(నమస్తే తెలంగాణ) : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో రేషన్ దందా జోరుగా సాగుతున్నది. జిల్లా సరిహద్దు మండలాల నుంచి బియ్యాన్ని తరలిస్తున్నారు. కొన్ని చోట్ల లబ్ధిదారులు బియ్యం తీసుకుని వీధి వ్యాపారులకు విక్రయిస్తున్నారు. మరికొన్ని చోట్ల డీలర్లు లబ్ధిదారులకు బియ్యం ఇవ్వకుండానే నేరుగా రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారు. స్థానికంగా కిలోకు రూ.12 కొనుగోలు చేసి, మహారాష్ట్రలో రూ.20లకు విక్రయిస్తున్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, చిన్న వ్యాన్‌లలో తరలించి జిల్లా సరిహద్దులోని గోదాముల్లో డంప్ చేస్తారు. అక్కడి నుంచి భారీ వాహనాల్లో గొందియా, బల్లార్షలోని రైస్‌మిల్లులకు తరలిస్తున్నారు. అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని పట్టుకునేందుకు చెక్‌పోస్టులు లేవు. ఎవరైనా పట్టుకుంటే చేతి తడిపితే చాలు. బియ్యం తరలించే వాహనాలు తెల్లవారు జామున, రాత్రి వేళల్లో మహారాష్ట్రలో ఉంటాయి. టాస్క్‌ఫోర్స్ అధికారులు కేసులు నమోదు చేస్తున్నప్పటికీ, అక్రమార్కుల దందా ఆగడం లేదు. తాజాగా టాస్క్‌ఫోర్స్ అధికారులు పెంచికల్‌పేట్‌లో ఓ వ్యాపారి ఇల్లు సోదాలు చేసి 15 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నారు.


హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

# హనుమాన్ ఆలయంలో ఆత్రం సక్కు పూజలు

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 20 : జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ ఆలయంలో ఆదిలాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు ప్రత్యేక పూజలు చేశారు. బీ-ఫామ్ తీసుకున్న తర్వాత మొదటిసారి జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయన ఆలయానికి చేరుకొని మొక్కుకున్నారు. అర్చకులు శిరీష్ శర్మ, శ్రీనివాసరావు ఆయనకు ఆశీర్వాదం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకుడు జాలీంషా, సక్కు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### జయంతి ఉత్సవాలకు ఆహ్వానం

ఈ నెల 23న నిర్వహించే హనుమాన్ జయంతి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను కమిటీ సభ్యులతో కలిసి బీఆర్ఎస్ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ధర్మపురి వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు పిన్న వివేక్, గుండా వెంకన్న, రాధాకృష్ణాచారి, ఎకరాల శ్రీనివాస్, డాక్టర్ మధు, ప్రదీప్, సురేందర్ పాల్గొన్నారు.


మంచిర్యాలలోని పండ్ల గోదామును తనిఖీ చేస్తున్న అధికారులు

# పండ్ల గోదాములను తనిఖీ చేసిన అధికారులు

మంచిర్యాలటౌన్, ఏప్రిల్ 20: మంచిర్యాల పట్టణంలోని పండ్ల దుకాణాలను శనివారం ఫుడ్ ఇన్‌స్పెక్టర్, మున్సిపల్ కమిషనర్ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. మామిడికాయ, సపోట, తర్బూజ, ద్రాక్ష, ఇతర పండ్లు పండించడం కోసం 10 కిలోలకు ఒక ఇథేఫాన్ ప్యాకెట్ వాడాల్సి ఉంది. కానీ ఇక్కడి వ్యాపారులు దాదాపు ఆరు ప్యాకెట్ల వరకు వేసి పండ్లు పండిస్తుండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై నిబంధనల ప్రకారమే నడుచుకోవాలని అధికారులు వ్యాపారులకు సూచించారు. మొదటిసారి అయినందున హెచ్చరించి వదిలేస్తున్నామని, త్వరలో మళ్లీ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహిస్తుమని, ఆ సమయంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించనట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తప్పవని, గోదాములు సీజ్ చేస్తామని తెలిపారు. ఈ తనిఖీల్లో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వాసురామ్, మున్సిపల్ కమిషనర్ ఏ మారుతీప్రసాద్, రెవెన్యూ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మజార్, తదితరులు పాల్గొన్నారు.

# ఖర్చుల వివరాలు కచ్చితంగా నమోదు చేయాలి

**పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల ఖర్చుల పరిశీలకుడు సమీర్ నైరంతర్య**


మాట్లాడుతున్న ఎన్నికల ఖర్చుల పరిశీలకులు సమీర్ నైరంతర్య

నస్పూర్, ఏప్రిల్ 20 : పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని చెన్నూరు, బెల్లంపల్లి, మంచిర్యాల అసెంబ్లీ సెగ్మెంట్లలో జరగనున్న ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, రాజకీయ పార్టీల ఖర్చుల వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల ఖర్చుల పరిశీలకుడు సమీర్ నైరంతర్య అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, అదనపు కలెక్టర్ రాహుల్‌తో కలిసి ఆర్డీవోలు, ఎన్నికల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ప్రచార కార్యక్రమంలో భాగంగా చేసే ప్రతి ఖర్చునూ తప్పనిసరిగా లెక్కించాలని తెలిపారు. సీ-విజిల్ యాప్ ద్వారా అందిన ఫిర్యాదులను 100 నిమిషాల్లో పరిష్కరించాలన్నారు. సరైన ఆధారం లేకుండా పట్టుబడే నగదు, మద్యం, బంగారాన్ని సీజ్ చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని తెలిపారు. కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ ఈ నెల 25 వరకు నామినేషన్‌ల స్వీకరణ, 26న పరిశీలన, 29న ఉపసంహరణ, తుది జాబితా అనంతరం మే 13న పోలింగ్ ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు తగిన సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు.

# నకిలీ విత్తనాలకు అడ్డుకట్ట పడేదెలా..?

- 'ఈ -పాస్' అమలులో యంత్రాంగం విఫలం
- పోర్టల్‌ను పట్టించుకోని వ్యాపారులు
- పర్యవేక్షించని అధికారులు
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు


ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీచేస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఏప్రిల్ 20 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో యేటా నకిలీ విత్తనాలు, ఎరువుల దందా జోరుగా సాగుతున్నది. అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు గత సర్కారు ఈ-పాస్ విధానాన్ని అమల్లోకి తీసుకురాగా, అధికారులు, వ్యాపారులు పట్టించుకోకపోవడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోవాల్సి వస్తున్నది.

### ఆన్‌లైన్ విధానం అమలుతో మేలు..

నకిలీ విత్తనాలకు అడ్డుకట్ట వేసేందుకు గత సర్కారు ఈ-పాస్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇందుకోసం ఒక్కో డీలర్లకు ప్రత్యేకంగా ఐడీలు జారీ చేసింది. లైసెన్స్ ఉన్న ప్రతి ఒక్కరూ తాము కొనుగోలు చేసిన విత్తనాలతో పాటు వాటి రకాలు, నిల్వలు, ధరలు, లాట్ నంబర్లు, ఏ రైతుకు ఎంత విక్రయించారు.. తదితర వివరాలను వ్యవసాయశాఖ పోర్టల్‌లో లాగిన్ అయి నమోదు చేయాలి. ఈ విధానంతో జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు అధికారులు స్వయంగా పరిశీలించే వీలుకలుగుతుంది. కానీ, ప్రస్తుతం ఫారం-డీ రూపంలో వ్యవసాయ అధికారులకు మాన్యువల్‌గా సమాచారం అందిస్తున్నారు. దీని వల్ల ఉన్నతాధికారులకు కచ్చితమైన సమాచారం అందుబాటులో ఉండడం లేదు. దీంతో వ్యాపారులు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో జోరుగా దందా సాగిస్తున్నారు. అమాయక రైతులకు నకిలీ విత్తనాలు అంటగడుతూ నట్టేట ముంచుతున్నారు. సీజన్ ప్రారంభంలో హడావుడిగా ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేసే అధికారులు, ఆ తర్వాత కన్నెత్తి చూడకపోవడం వల్లే ఈ పరిస్థితి వస్తుందంటూ పలువురు ఆరోపిస్తున్నారు. ఆన్‌లైన్ విధానం పక్కాగా అమలు చేస్తే నకిలీ విత్తనాలకు అడ్డుకట్ట వేయవచ్చని చెబుతున్నారు.

### వానకాలంలో 4.25 లక్షల ఎకరాల్లో సాగు

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఈ వానకాలం 4.25 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని అధికారులు అంచనా వేశారు. జిల్లాలో మొత్తం 12 పీఏసీఎస్‌లు ఉండగా, 14 రైతు సేవా కేంద్రాలు, 338 ఫర్టిలైజర్స్ దుకాణాలు ఉన్నాయి. వరి విత్తనాలు 13,883.5 క్వింటాళ్లు, పత్తి విత్తనాల ప్యాకెట్లు 7,64,748, కంది 1,788.88 క్వింటాళ్లు, సోయాబీన్ 526.2 క్వింటాళ్ల విత్తనాలు, అలాగే 46 వేల మెట్రిక్ టన్నుల యూరియా, 23 వేల మెట్రిక్ టన్నుల డీఏపీ, 23 వేల మెట్రిక్ టన్నుల పొటాష్, సూపర్‌ఫాస్పేట్ 23 వేల మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 20 వేల మెట్రిక్ టన్నులు అవసరముంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వానకాలం పంటల సాగుకు సమయం ఆసన్నమవుతున్న తరుణంలో యంత్రాంగం అప్రమత్తంగా ఉండి, నకిలీ విత్తనాలు, ఎరువుల విక్రయాలకు చెక్‌పెట్టేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# ఇంద్రవెల్లి అమరులకు నివాళి

- సంప్రదాయబద్ధంగా శ్రద్ధాంజలి ఘటించిన ఆదివాసులు
- నివాళులర్పించిన మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు, ప్రముఖులు


అమరవీరులకు నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 20 ః ఇంద్రవెల్లి మండలంలోని హీరాపూర్ గ్రామ సమీపంలో గల అమరవీరుల స్తూపం వద్ద అమరవీరుల ఆశయ సాధన కమిటీ, ఆదివాసీ గిరిజనుల ఆధ్వర్యంలో స్వేచ్ఛగా నివాళులర్పించారు. ఏప్రిల్ 20, 1981లో పోలీసు కాల్పుల్లో అమరులైన వీరులకు ఆదివాసీ గిరిజనులు తమ సంస్కృతీ సంప్రదాయబద్ధంగా శనివారం ప్రత్యేక పూజలు చేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఉమ్మడి జిల్లాలోని ఆయా మండలాలతోపాటు వివిధ ప్రాంతాల నుంచి ఆదివాసీ గిరిజనులు ఉదయం 10 గంటలకు స్తూపం వద్దకు చేరుకున్నారు. గోండ్‌గూడ నుంచి ప్రారంభమైన ర్యాలీ మండల కేంద్రంలో గుండా అమరవీరుల స్తూపం వద్దకు చేరుకుంది. ముందుగా అమరవీరుల పేరిట జెండాను ఆవిష్కరించారు. అనంతరం సంప్రదాయ పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. అమరవీరుల స్తూపంతోపాటు జెండాల వద్ద సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించి, అమరవీరుల కుటుంబ సభ్యులతోపాటు ఆదివాసులు నివాళులర్పించారు.

### తొడసం ఖట్టికి నివాళులు

ఆదివాసీ గిరిజన హక్కుల కోసం పోరాటాలు చేసి మృతి చెందిన తొడసం ఖట్టికి తుమ్మగూడ గ్రామానికి చెందిన ఆదివాసీ గిరిజనుల ఆధ్వర్యంలో నివాళులర్పించారు. మండలంలోని తుమ్మగూడ గ్రామస్తుల ఆధ్వర్యంలో సమక ఎక్స్‌రోడ్డు వద్ద ఖట్టి స్మారకార్థం ఏర్పాటు చేసిన జెండాను ఆవిష్కరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ఆదివాసీ గిరిజనులు మాట్లాడారు. ఆదివాసీ గిరిజనుల కోసం ఆయన ఉద్యమాలు చేశారన్నారు. గిరిజనుల హక్కుల కోసం ఉద్యమాలు చేసిన తొడసం ఖట్టిని అప్పటి పోలీసులు హైద్రాబాద్‌లోని చంచల్‌గూడ జైల్‌లో ఆరేండ్లు నిర్బంధించారన్నారు. యేటా ఏప్రిల్ 20వ తేదీన సంస్మరణ దినంగా నిర్వహిస్తున్నామన్నారు.

### నివాళులర్పించిన ప్రముఖులు

శిశు సంక్షేమ శాఖ, ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న, జడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, మాజీ ఎంపీ సోయం బాపురావ్, బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగన, బీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ భూక్యా జాన్సన్ నాయక్, రాయిసెంటర్ల సార్‌మేడిలు, ఆదివాసులు అమరవీరులకు నివాళులు అర్పించారు.


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుబ్బా రాయుడు

## అప్రమత్తంగా ఉండాలి

**డీఎంహెచ్‌వో సుబ్బా రాయుడు**

నెన్నెల, ఏప్రిల్20 : ఎండలు ముదురుతుండడంతో అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బారాయుడు వైద్య సిబ్బందికి సూచించారు. శనివారం నెన్నెల ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో సమావేశమయ్యారు. వైద్య సిబ్బందికి సలహాలు-సూచనలు చేశారు. ప్రస్తుతం పల్లెల్లో వ్యవసాయ పనులు, ఉపాధి పనులు కొనసాగుతున్నాయని, వడదెబ్బ బారిన పడకుండా రైతులు, కూలీలలకు అవగాహన కల్పించాలన్నారు. పని ప్రదేశాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఎండ దెబ్బ తగిలి హాస్పిటల్‌కు వచ్చే వారికి సకాలంలో వైద్యం అందించాలన్నారు. ఆయన వెంట పీవో డాక్టర్ శివ ప్రతాప్, పీహెచ్‌సీ వైద్యుడు లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజన్స్‌కు ప్రత్యేక లైను

కాగజ్‌నగర్, ఏప్రిల్ 20 : పార్లమెంట్ ఎన్నికల రోజు సీనియర్ సిటిజన్స్‌కు ప్రత్యేక లైను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాలు జారీ చేసినట్లు సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారావు రాసిన లేఖకు రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషన్ వికాస్ రాజ్ స్పందించి జిల్లా ఎన్నికల అధికారులకు ఆదేశాలు జారీ చేశారని ఆయన పేర్కొన్నారు.

## ఆకస్మిక తనిఖీలు

**- రూ.1.15 లక్షలు పట్టివేత**

సారంగాపూర్, ఏప్రిల్ 20 : చించోలి(బి) చెక్‌పోస్టు వద్ద ఎస్ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. సారంగాపూర్ మండలం కౌట్ల(బి) గ్రామానికి చెందిన లక్ష్మణ్ తన వాహనంలో రూ.1.15 లక్షల నగదు తీసుకుని నిర్మల్ వైపు వెళ్తుండగా పట్టుకున్నారు. డబ్బులకు అనుమతి పత్రాలు లేకపోవడంతో నిర్మల్ కలెక్టర్ కార్యాలయానికి తరలించి ప్రత్యేక అధికారికి డిపాజిట్ చేశారు. అనుమతి లేకుండా డబ్బులు తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

# చెరువుల్లో పూడికతీత త్వరగా పూర్తి చేయాలి

**ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ దోత్రే**


సమావేశంలో మాట్లాడుతున్న కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 20 : జిల్లాలోని చెరువులు, కుంటలు, కాలువల్లో పూడికతీత పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా నీటిపారుదల శాఖ, ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల నిర్మాణం, నీటిపారుదల ప్రాజెక్టుల్లో నీటిమట్టం, పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రైతులు సాగు నీటి కోసం ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాలని, సాగునీటి లభ్యతపై వ్యవసాయ శాఖ అధికారులకు అవగాహన కల్పించాలని సూచించారు. సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఈఈలు గుణవంతరావు, ప్రభాకర్, డీఈఈలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

జిల్లాలోని మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ, జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపల్ కమిషనర్లతో కలిసి పంచాయతీ, మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల్లో ప్రతిరోజూ పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంప్ యార్డ్‌కు తరలించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలోని మారుమూల ప్రాంతాలకు సైతం తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ మున్సిపల్ కమిషనర్లు భుజంగరావు, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారీ, జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్‌తో కలిసి పంచాయితీ రాజ్, విద్యాశాఖ, రోడ్లు-భవనాల శాఖ, ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాలుగా గుర్తించబడిన ప్రభుత్వ పాఠశాలల్లో పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలో తాగునీటి సౌకర్యం కల్పించాలని, మూత్రశాలలు, మరుగుదొడ్లు, అదనపు గదుల నిర్మాణం చేపట్టాలని, పనులు పురోగతి ఫొటోలను సంబంధిత పోర్టల్‌లో నమోదు చేయడంతో పాటు నివేదిక రూపొందించి అందించాలని తెలిపారు.